# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 04-04-2016**

ప్రస్తుతం హైదరాబాద్ నగర స్థితిగతులను పూర్తిగా అవగతం చేసుకుని భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా నగరాన్ని తీర్చిదిద్దాల్సిన తక్షణ కర్తవ్యం కొత్తగా గెలిచిన కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులపై ఉందని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. కార్పొరేటర్లు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వాల విధానాల వల్ల జిహెచ్ఎంసి ఆర్థిక పరిస్థితి దిగజారిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన హైదరాబాద్ కార్పొరేటర్లకు ఈ నెల 11, 12 తేదీలతో, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం కార్పొరేషన్లకు చెందిన టిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఈ నెల 13వ తేదీన ప్రగతి రిసార్ట్స్ లో ఆస్కి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని సిఎం నిర్ణయించారు. జిహెచ్ఎంసి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి కెటి. రామారావు, నగరానికి చెందిన మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంజి గోపాల్, ముఖ్య కార్యదర్శి సి. నర్సింగ్ రావు, జిహెచ్ఎంసి కమీషనర్ జనార్ధన్ రెడ్డి, హెచ్ఎండిఏ కమీషనర్ చిరంజీవులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దాన కిశోర్, ఆస్కి డైరెక్టర్ శ్రీనివాసాచార్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం నగరం ఓ విష వలయంగా మారిందని, దీన్నుంచి ప్రజలను బయట పడేయాలని చెప్పారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో ప్రజలు ఓ సునామీలా ఓట్లేసి టిఆర్ఎస్ పార్టీని గెలిపించారని, గుజరాతీలు, బెంగాలీలు, కన్నడిగులు, ఆంధ్ర ప్రాంతం వారు అనే బేధం లేకుండా ప్రతీ ఒక్కరు... గుడిసెలో

నివసించే వారి నుంచి భవంతుల్లో ఉండేవారి వరకు ప్రతీ ఒక్కరు టిఆర్ఎస్ కు ఓటేశారని సిఎం గుర్తు చేశారు. వారందరి నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు ఎవరికి వారు తమ బాధ్యతలు గుర్తెరిగి ప్రజల కోసం పనిచేయాలని చెప్పారు.

"ప్రతి నియోజక వర్గంలో 4,700 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామని చెప్పాం. దీనికి జాగాల అన్వేషణ కూడా జరుగుతోంది. ఇది ఫలించాలంటే ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కలిసి పని చేయాలి. పని చేస్తామని ప్రతిజ్ఞ తీసుకోవాలి. టీం వర్క్ తో పని చేయాలి. బృందాలుగా ఏర్పడి హైదరాబాద్ లో జరగాల్సిన, జరుగుతున్న పనులను పర్యవేక్షించాలి. రొటీన్ గా జరిగే పనులను కూడా తనిఖీ చేయాలి. మనందరం కలిస్తే ఏదైనా చేయవచ్చు" అని ముఖ్యమంత్రి అన్నారు.

జిహెచ్ఎంసిలో భాగంగానే పరిగణించి కంటోన్మెంట్ ను కూడా అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ ఎట్లుండేది? ఎట్లున్నది? ఎట్లుండాలి? అనే విషయాలను బేరీజు వేసుకుని కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. కాంట్రాక్టర్లు ముఠాలుగా ఏర్పడి చేసే దోపిడీకి అడ్డుకట్ట వేయాలన్నారు. నగరంలో కాపిటల్ అసెట్స్ పెరగడానికి, రోడ్లు బాగుపడడానికి జిహెచ్ఎంసి నిధులు కేటాయించాలని చెప్పారు.

మూడు రోజుల పాటు హైదరాబాద్ లో నిర్వహించే శిక్షణా తరగతుల్లో కార్పొరేటర్లను ఏ విధంగా కార్యోన్ముఖులను చేయాలనే విషయంలో అధికారులు ఎజెండా రూపొందించాలని కోరారు. శిక్షణా తరగతుల్లో ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొనాలని కోరారు. మౌలిక సదుపాయాల కల్పన, మంచినీటి సరఫరా, మంచినీటి కోసం శాశ్వత చర్యలు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ఐఎల్ఎఫ్ఎస్, ఇర్కాన్, బ్రిక్స్ బ్యాంక్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయన్నారు. కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం పెరగాలని సూచించారు. నగరాభివృద్ధి విషయంలో నాగపూర్, ముంబాయి, ఢిల్లీ తదితర నగరాల్లో అమలయ్యే కార్యక్రమాలను అధ్యయనం చేయాలని కోరారు. ఆయా కార్పొరేషన్ల మేయర్లు, కమీషనర్లను కూడా శిక్షణా తరగతులకు పిలిచి వారి అనుభవాలు పంచుకోవాలని సూచించారు.

ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఈ విషయాన్ని పారిశ్రామిక వేత్తలకు విడమరిచి చెప్పాలని, వారిలో విశ్వాసం నింపాలని చెప్పారు. చెత్త తొలగింపు, శిథిలాల తొలగింపు, నిధుల వినియోగం, పచ్చదనం పెంచడం, పారిశుద్య కార్యక్రమాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి తదితర అంశాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ జరగాలన్నారు. హైదరాబాద్ మహా నగరంలో కొత్తగా చేరిన మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కూడా ప్రణాళికలు సిద్ధం కావాలన్నారు.

ఇప్పటికే మంజూరైన మల్టిలెవల్ ఫ్లై ఓవర్స్, బస్ బేస్, మార్కెట్లు, పబ్లిక్ టాయిలెట్లు, గ్రేవ్ యార్డులు, క్రిమటోరియమ్స్ తదితర పనుల పురోగతిపై అధికారులు దృష్టి పెట్టాలని, హైదరాబాద్ ను స్లమ్ లెస్ సిటీగా మార్చే ప్రణాళికను అమలు చేయాలని చెప్పారు. ప్రతీ ఐదు వేల మందికి ఒక ప్రజా కమిటీ పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జీహెచ్ఎంసీ సమీక్ష - రెండవ సెషన్

-------------------------------------------

హైదరాబాద్ నగరంలో నిరుపేదల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టడానికి అనువైన స్థలాలను గుర్తించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పై క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం సమీక్ష కొనసాగింది. మంత్రులు కెటి. రామారావు, నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్, పద్మారావు, ఎమ్మెల్యేలు సాయన్న, కనకారెడ్డి, వివేకానంద, ప్రకాశ్ గౌడ్, మాగంటి గోపీనాథ్, అరికెపూడి గాంధి, మాధవరం కృష్ణారావు, స్టీఫెన్ సన్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నగరంలో ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంత ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది? ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులెన్ని? పాత ఇండ్లు తొలగించుకుని కొత్త ఇండ్లు కట్టుకోవడానికి సిద్ధపడే బస్తీలెన్ని? తదితర విషయాలపై నివేదిక రూపొందించాలని కోరారు. సమాంతరంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే సారి డబుల్ బెడ్

రూమ్ ఇండ్లు కట్టాలని సిఎం సూచించారు. నగర పాలనలో పోలీసులు, రవాణా అధికారులు, కలెక్టర్ల సహకారం కూడా తీసుకోవాలని, జిహెచ్ఎంసి సమావేశాలకు హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లను, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్లను కూడా ఆహ్వానించాలని సిఎం చెప్పారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, హెచ్ఎండబ్ల్యుఎస్ లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నగరంలో మంచినీరు, మురుగునీరు, వరద నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు ముప్పు లేకుండా దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సిఎం చెప్పారు. నగరంలో 3800కు పైగా బస్సులు తిరుగుతున్నాయని, వాటికోసం అవసరమైనన్ని బస్ బేలు నిర్మించాలని కోరారు.

కార్పొరేటర్ల శిక్షణకు ఆస్కి సిలబస్

-----------------------------------------

ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు టిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఇచ్చే శిక్షణ కోసం సిలబస్ తయారు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆస్కిని కోరారు. నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ, కార్పొరేటర్ల పాత్రపై అవగాహన కల్పించాలని చెప్పారు. తాను కూడా మూడు రోజులు అక్కడే ఉంటానని, రాత్రి అక్కడే నిద్రపోతానని, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఉండాలని సిఎం ఆదేశించారు. 11, 12 తేదీల్లో జిహెచ్ఎంసి కార్పొరేటర్లకు, 13న మిగతా కార్పొరేషన్ల కార్పొరేటర్లను కూడా కలిపి శిక్షణ ఉంటుందని సిఎం వెల్లడించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**